## అధ్యాయము 7

# తెగుళ్లు: నీరు రక్తముగా మారుట

ఫరో ఆధిపత్యం నుండి ఇశ్రాయేలీయులను విడిపించుటకు మోషే చేసిన మొదటి ప్రయత్నంలో విఫలమైన తరువాత (అధ్యా. 5; 6), అధ్యాయము 7లో దేవుని ప్రజలను వెళ్లనిచ్చుటకు ఐగుప్తు రాజును ఒప్పించుటలో విజయవంతమైన ప్రయత్నం యొక్క ప్రారంభం గురించి చెప్పబడింది. విమోచన పది తెగుళ్ల ద్వారా సాధించబడింది. అందుచేత, అధ్యాయాలు 7 నుండి 13 వరకు చెప్పబడిన విధంగా ఇశ్రాయేలీయుల విమోచన కథ ఎక్కువగా తెగుళ్ల కథగా ఉంది.

"నేను మాట మాంద్యము గలవాడను" (6:30) అని మోషే దేవునికి ఫిర్యాదు చేసినప్పుడు, ఆయన సమాధానముతో అధ్యాయము 7 మొదలౌతుంది. ఆయన సీనాయి యొద్ద ఏర్పాటు చేసిన విధంగా, దేవుడు మోషే బలహీనతయందు అహరోనును తనకు ప్రవక్తగా ఇచ్చెను (7:1, 2). మరలా, మోషే మరియు అహరోనులు ఫరోతో మాట్లాడినప్పుడు ఏమి జరుగుతుందో కూడా ఆయన తెలియజేసెను (7:3-5).

తరువాత, దేవుని ఆజ్ఞలకు మోషే మరియు అహరోనులు లోబడ్డారో వాక్యభాగం స్పష్టంచేసింది (7:6, 7). వారు ఫరో యెదుటకు వెళ్లి, ఇశ్రాయేలీయులను వెళ్లనిమ్మని కోరి, మరియు ఆయన యెదుట అద్భుతమును చేసెను: అహరోను కర్ర పాముగా మారెను. అయితే, ఐగుప్తు శకునగాండ్రు కూడా అలాగే చేశారు, మరియు ఫరో ఇశ్రాయేలీయుల విన్నపమును తిరస్కరించెను (7:8-13).

అప్పుడు, దేవుని ప్రోద్బలంతో, మోషే అహరోనులు ఫరో యొద్దకు వెళ్లి ఐగుప్తు నీరును దేవుడు రక్తముగా మారుస్తాడని ఆయనను హెచ్చరించారు. దాని తరువాత మొదటి తెగులు వచ్చింది (7:14-21). శకునగాండ్రు కూడా ఈ అద్భుతమును చేయుటకు ప్రయత్నించినప్పుడు, ఫరో హృదయము కఠినమాయెను, మరియు ఆయన ఇశ్రాయేలీయుల విన్నపమును తిరస్కరించెను (7:22-25).

### విజయమిస్తానను దేవుని వాగ్దానం (7:1-7)

**1కాగా యెహోవా మోషేతో ఇట్లనెను - ఇదిగో నిన్ను ఫరోకు దేవునిగా నియమించితిని, నీ అన్న అహరోను నీకు ప్రవక్తగా నుండును. 2నేను నీ కాజ్ఞాపించునది యావత్తు నీవు పలుకవలెను. ఫరో తన దేశములోనుండి ఇశ్రాయేలీయులను పోనియ్యవలెనని నీ అన్నయైన అహరోను అతనితో చెప్పును. 3అయితే నేను ఫరో హృదయమును కఠినపరిచి, ఐగుప్తు దేశములో నా సూచక క్రియలను నా**

**మహత్కార్యములను విస్తరింపచేసెదను. [4]ఫరో మీ మాట వినడు గాని నేను నా చెయ్యి ఐగుప్తు మీద వేసి గొప్ప తీర్పులచేత నా సేనలను ఇశ్రాయేలీయులైన నా ప్రజలను ఐగుప్తుదేశములోనుండి వెలుపలికి రప్పించెదను. [5]నేను ఐగుప్తుమీద నా చెయ్యి చాపి ఇశ్రాయేలీయులను వారి మధ్యనుండి రప్పింపగానే నేను యెహోవానని ఐగుప్తీయులు తెలిసికొందురనెను. [6]మోషే అహరోనులు యెహోవా తమకు ఆజ్ఞాపించినట్లు చేసిరి, ఆలాగుననే చేసిరి. [7]వారు ఫరోతో మాటలాడినప్పుడు మోషేకు ఎనుబదిఏండ్లు, అహరోనుకు ఎనుబది మూడు ఏండ్లు.**

**వచనములు 1, 2.** దేవుడు **మోషేతో** మాట్లాడెను. ఇశ్రాయేలీయులను విడిపించుటలో గల వైఫల్యానికి (4:29-6:9) మరియు మోషేను పిలచుటకు (6:10-13, 28, 29) మధ్య గణనీయమైన సమయం గతించి యుండవచ్చు. మోషే మునుపు చెప్పిన అభ్యంతరమును మరియు దేవుని ఏర్పాటును మరచియుండవచ్చును (4:10-16; 6:12, 30 చూడండి). అయితే, దేవుడు మోషేతో సహనము కలిగియున్నాడు. మోషే మతిమరుపును గూర్చి మరియు విశ్వాసంలేనిదానిని గూర్చి ఆయన నిందించలేదు, గాని ఆయన మునుపు చెప్పిన దానిని పునరావృతం చేసెను (3:10; 4:15, 16, 22, 23). ఏ విధంగా **ప్రవక్త** దేవుని బూరగా ఉండునో అలాగే **అహరోను** మోషేకు బూరగా (ప్రతిగా మాటలాడు వానిగా) ఉండును, మరియు **ఫరో** ఆ సందేశమును అందుకొనువానిగా ఉండును.

**వచనములు 3, 4. ఫరో హృదయమును కఠిపరచుటవలన** తమను విడిచిపెట్టమని ఇశ్రాయేలీయులు చేయు విన్నపమును రాజు **వినడని** దేవుడు తరచు మోషేను హెచ్చరించెను. మునుపు దేవుడు మోషేకు ఇచ్చిన హెచ్చరికలను, ఈ సందేశము ప్రతిధ్వనిస్తుంది (3:19-22; 4:21). స్పష్టంగా, దేవుడు మోషేను పిలిచింది సుళువైన పని కొరకు కాదన్న విషయం మోషే అర్థం చేసుకోవాలని దేవుడు ఆలోచించాడు; ఆలకించని రాజుతో ఆయన మాట్లాడాలి. మోషే అణగారకుండ లేదా పనిని విడిచిపెట్టకుండ ఉండాలని దేవుడు ముందుగానే మోషేకు ఫరో యొక్క మొండితనమును గూర్చి చెప్పాడు. తరువాత సందర్భాలలో దేవుడు కొంతమంది ప్రవక్తలను పిలచినప్పుడు, తమ యొక్క ప్రాథమిక ప్రేక్షకులు తమ మాట వినరని దేవుడు వారికి తెలియజేసాడు.

"నేను ఫరో హృదయమును కఠినపరచెదను" అన్న పదసమూహము మరియు అలాటి పరిభాషలు పది తెగుళ్ల కథనమంతటిలో కనిపిస్తుంది (9:12; 10:1, 20, 27; 11:10; 14:4, 8, 17). దేవుడు ఫరో హృదయమును తన చిత్తమునకు వ్యతిరేకముగా కఠినపరచాడా, తన ఇష్ట స్వేచ్ఛకు దూరంగా ఉంచి మరియు తన దైవ ప్రణాళికలో కేవలం ఒక బంటుగా ఉంచాడని దీని అర్థమా? ఫరో హృదయం కఠినమవ్వడానికి గల కారణం దేవుడని ఇక్కడ వాక్యభాగం తెలియజేస్తే, నిర్గమకాండములో గల ఇతర వచనములు మాత్రం ఫరో తన హృదయమును కఠినపరచుకొన్నాడని తెలియజేస్తుంది (7:13, 14, 22, 23; 8:15, 19, 32; 9:7, 34, 35). స్పష్టంగా, మోషే అడిగినవాటిని ఫరో ప్రతికూలంగా స్పందించుటకు ఎంపిక చేసుకున్నాడు. కఠిన హృదయమును

ప్రదర్శించిన పిమ్మట, దేవుడు అదనంగా చేసిన కాఠిన్యమునకు ఫరో లోనైనాడు. ఒకడు తన హృదయమును కఠినపరచుకొని మరియు క్రిందకి (నాశనము) పోవు మార్గమును ఎంచుకొన్నప్పుడు, దేవుడు అనుమతిస్తాడు - మరియు క్రింద మార్గం నుండి అతనిని నాశనమునకు అప్పగిస్తాడు.

ఫరో హృదయం కఠినమైనప్పుడు, ఇశ్రాయేలీయులను విడిపించుటకు దేవుడు **సూచనలను** (אוֹת, *'oth*), **అద్భుతాలను** (מוֹפֵת, *mopeth*), మరియు **తీర్పును** (שֶׁפֶט, *shepet*) చేయడానికి పూనుకొన్నాడు. నిర్గమకాండము అంతటిలో, పది తెగుళ్లు "సూచనలుగా మరియు అద్భుతములుగా" లేదా కేవలం "సూచనలుగా" (7:3; 8:23; 10:1, 2) మరియు "తీర్పు" (7:4; 12:12) అదే విధంగా "తెగుళ్లు"గా (9:14; 11:1; 12:13) పిలువబడ్డాయి. ఈ వివరణాత్మక పదాలు "విసరు" లేదా "దెబ్బకొట్టుట" అను మాటలను ఫరోకు వ్యతిరేకంగా పంపించడానికి దేవుడు ప్రణాళిక వేసాడు అని తెలియజేస్తుంది.

తుదకు, **ఇశ్రాయేలీయులైన నా ప్రజలను** గుర్తింపబడిన [తన] **సేనలను** దేవుడు **వెలుపలికి రప్పిస్తాడు.** "సేనలు" (צָבָא, *tsaba'*) అను పదము "సైన్యాలుగా" సూచింపబడింది. తప్పించుకున్న బందీలు సేనలవలె కనిపించకపోయినను, శక్తివంతంగా పోరాడగలిగే సామర్థ్యం వారికి ఉంది. దేవుని శక్తి ద్వారా బలపరచబడి, ఆయన వారికిచ్చిన దేశమును ఆక్రమించుకొను మార్గంలో నిలబడ్డ ప్రతి దేశమును ఓడించారు.

ఈ వాక్యభాగం ద్వారా నేర్చుకోవలసిన ప్రాముఖ్యమైన పాఠం ఏంటంటే (సమస్తం) *దేవుని నియంత్రణలో ఉంది.* దేవుడు మోషేతో మాట్లాడాడు; ఆయన ఫరో హృదయమును కఠినపరచాడు; ఆయన తెగుళ్లను పంపాడు; ఆయన ప్రజలను విమోచించాడు; మరియు ఆయన చివరకు ఐగుప్తీయుల చేత మహిమపరచబడ్డాడు. వారు చివరకు మోషే యొక్క శక్తిగల దేవునికి వ్యతిరేకంగా వారిని రక్షించలేని తమ దేవతల యొక్క అసమర్థతను గ్రహించారు. నిర్గమకాండమంతట, యెహోవాయే "ప్రత్యక్షత మరియు విమోచన వర్ణనలలో ప్రధానమైన రవాణాగా ఉండి మరియు నిబంధనను ఇచ్చువాడుగా ఉన్నాడు."[1] నాటకీయ పుస్తకములో మోషే పాత్రను వహించాడు, కాని దేవుడే దానికి రచయిత, దర్శకుడు, మరియు ప్రధానమైన పాత్ర.

**వచనము 5.** దేవుని "సూచనల" "అద్భుతాల", మరియు "తీర్పుల" (7:3, 4) ఫలితంగా ఆయనే **యెహోవాయని ఐగుప్తీయులు తెలుసుకొంటారు.** ఇశ్రాయేలీయులు బంధకములో నుండి తప్పించుటకు యెహోవాయే సహాయం చేసాడని ఐగుప్తీయులు గ్రహించడం మాత్రమే దీని అర్థం కాదు గాని. బదులుగా, యెహోవాను గూర్చి ఇంతకు ముందు ఎరుగని దానిని ఐగుప్తీయులు తెలుసుకొంటారు. యెహోవాను "తెలుసుకొనుట" అంటే దేవుని పేరు కంటేకూడా ఎక్కువగా తెలిసుకోవడం; ఆయనను గూర్చి కొంత తెలుసుకోవడం - ఆయన స్వభావం, ఆయన లక్షణం, ఆయన శక్తి, మరియు ఆయన బలం గురించి తెలుసుకోవడం. ఐగుప్తీయులు ఆయనను తెలుసుకోవడానికి దేవుడు ఈ తెగుళ్లను పంపాడు, అంటే ఐగుప్తీయులకు తనను గూర్చి గొప్ప సత్యములను కనుపరచడానికి. అన్యజనులైన ఐగుప్తీయులలో కూడా తాను

తెలియబడాలని దేవుడు కోరుకొన్నాడు.

**వచనము 6.** దేవుని సేవకులు ఆయన యొక్క ఆదేశాలకు కట్టుబడియున్నారు: **మోషే అహరోనులు యెహోవా తమకు ఆజ్ఞాపించినట్లు చేసిరి, ఆలాగుననే చేసిరి.** ఈ ప్రకటన వాక్యభాగమునకు ముగింపుగానే పనిచేయదు (7:1-7) గాని, తరువాత అనుసరించు కథనమునకు అనగా Pentateuchలో (పంచ గ్రంథాలు) కనిపించు అంశమునకు - అనగా దేవుని ప్రజల విధేయతకు (7:20; 39:43 చూడండి) ఉపోద్ఘాతముగా పనిచేస్తుంది. ఈ సమయం నుండి, మోషే అహరోనులు దేవుని ఆజ్ఞలను అనుసరించారు.

**వచనము 7. మోషేకు ఎనుబదిఏండ్లు, అహరోనుకు ఎనుబది మూడు ఏండ్లు** అను ప్రకటన కుండలీకరణంగా పరిగణించబడాలి, ఇది కథనములోనున్న రెండు ప్రాముఖ్యమైన వ్యక్తుల యొక్క వ్యక్తిగత సమాచారమును తెలియజేయుటకు ఇమడ్చబడింది. ఇది, కూడా, పంచగ్రంథాలలో విలక్షణమైనది. ఆదికాండములో తరచు, మరియు ధర్మశాస్త్రంలో (పంచ గ్రంథాలలో) తక్కువగా, రచయిత వ్రాయుచున్న వ్యక్తుల యొక్క వయస్సును కూడా చెప్పాడు. "మోషే అహరోనులు అనుభవ జ్ఞానం పొందునంత వయస్సు వరకు జీవించుట ద్వారా కొంత గౌరవమును పొందు హక్కును సాధించారని"[2] కూడా ఈ వాక్యభాగము సూచించవచ్చు. నేడు అనేకమంది పదవి విరమణ చేయు వయస్సులో, ఎనభై సంవత్సరాల వయస్సు గల మోషే ఒక జీవితకాల సాహసమును చేయుటకు పూనుకున్నాడు మరియు ఆ పని కొరకు అతడు శాశ్వతంగా గుర్తుండిపోతాడు.

## కఱ్ఱతో చేసిన అద్భుతం (7:8-13)

**8మరియు యెహోవా మోషే అహరోనులతో ఇట్లనెను - 9ఫరో మీ శక్తి చూపుటకై ఒక మహత్కార్యము కనుపరచుడని మీతో చెప్పునప్పుడు నీవు అహరోనును చూచి - నీ కఱ్ఱను పట్టుకొని ఫరో యెదుట దాని పడవేయుమనుము; అది సర్పమగును. 10కాబట్టి మోషే అహరోనులు ఫరో యొద్దకు వెళ్లి యెహోవా తమకాజ్ఞాపించినట్లు చేసిరి. అహరోను ఫరో యెదుటను అతని సేవకుల యెదుటను తన కఱ్ఱను పడవేయగానే అది సర్పమాయెను. 11అప్పుడు ఫరో తన విద్వాంసులను మంత్రజ్ఞులను పిలిపించెను. ఐగుప్తు శకునగాండ్రు కూడా తమ మంత్రములచేత ఆలాగే చేసిరి. 12వారిలో ప్రతివాడును తన కఱ్ఱను పడవేసినప్పుడు అది సర్పమాయెనుగాని అహరోను కఱ్ఱ వారి కఱ్ఱలను మ్రింగివేయగా 13యెహోవా చెప్పినట్టు ఫరో హృదయము కఠినమాయెను గనుక అతడు వారి మాట వినకపోయెను.**

**వచనములు 8-10.** మొదటిసారిగా **మోషే** మరియు **అహరోనులు ఫరో** యెదుట కనిపించిరి, వారు ఏ అద్భుతమును చేయలేదు (5:1-4). రెండవమారు ఆయన యొద్దకు వెళ్లినప్పుడు, అహరోను కఱ్ఱను సర్పముగా మార్చుట ద్వారా తమ యొక్క సాధకములను ప్రదర్శించమని దేవుడు వారికి చెప్పెను (4:1-5 చూడండి). దేవుని

ఆజ్ఞలను అనుసరించి, వారు **ఫరోను** కలుసుకొనిరి, మరియు అహరోను కఱ్ఱ సర్పముగా మారెను.

వచనము 10 నుండి రెండు ప్రశ్నలు ఏర్పడ్డాయి. మొదట, **అహరోను . . . తన కఱ్ఱను పడవేసెను**; కాని దేవుడు మొదట మోషేకు కనుపరచుకొన్నప్పుడు, సర్పముగా మారింది మోషే కఱ్ఱ (4:3). **అది సర్పమాయెను.** మోషే మరియు అహరోనుల కఱ్ఱలు రెండు సర్పములుగా మారెనా? బహుశా, ఈ కఱ్ఱ మోషే ఉపయోగించిన కర్రే కావచ్చు; దేవుడు మోషే మరియు అహరోను చేతిలో నున్న కఱ్ఱను దేవుడు శక్తితో నింపినప్పుడు అది అందరికీ సంబంధించినదిగా మారుతుంది. అది మోషే కఱ్ఱగా (9:23; 10:13; 14:16), అహరోను కఱ్ఱగా (7:10-12), లేదా దేవుని కఱ్ఱగా చెప్పబడుతుంది (4:20).

రెండవదిగా, 4:3లో సర్పము కొరకు వాడిన పదాలు వేరుగా ఉన్నాయి (נָחָשׁ, *nachash*) మరియు 7:10 (תַּנִּין, *thannin*). వాస్తవానికి, 7:10లో *thannin* అను పదమునకు "మొసలి" అని అర్థము మరియు అది Umberto Cassuto చేత అనువదించబడింది.[3] John I. Durham దానిని "వికృతమైన పాము" అని అనువదించాడు.[4] అధ్యాయము 4 కంటే అధ్యాయము 7లో ఉత్పత్తిచేయబడిన జీవి వేరొక రకమా? అధ్యాయము 7లో ఉత్పత్తి చేయబడినది బహుశా మొసలి లేదా ఒక పెద్ద ప్రాకే ప్రాణి కావచ్చు, రచయిత పర్యాయ పదంగా ఉపయోగించి యుండవచ్చు అని కూడా చెప్పవచ్చును.[5] ఈ ప్రశ్నల సమాధానాలతో సంబంధం లేకుండా, వాక్యభాగం యొక్క అర్థం ప్రభావితం కాదు: మోషే మరియు అహరోనులు ఆయన దూతలని ఫరోకు తెలియజేయడానికి దేవుడు అద్భుతములను చేసెను.

**వచనములు 11-13. ఐగుప్తు మంత్రజ్ఞులు తమ మంత్రముల చేత** ఈ అద్భుతకృత్యమును చేసినప్పుడు, **ఫరోపై** కలిగిన అద్భుతము యొక్క ప్రభావం ఏదైనా సరే అది రద్దైపోయింది. అయితే, **అహరోను కఱ్ఱ** మాంత్రికుల **కఱ్ఱలను** మ్రింగివేసిన అద్భుతమును మోషే అహరోనులు జరిగించినప్పుడు దేవుడు ఈ సూచన యొక్క ప్రామాణికతను నిరూపించాడు. అయితే, ఫరో ఒప్పుకోలేదు. **యెహోవా చెప్పినట్టు** అతని **హృదయము కఠినమాయెను గనుక అతడు** మోషే మరియు అహరోనుల **మాట వినకపోయెను.**

వాక్యభాగంలో మోషే మరియు అహరోనులు నిజమైన అద్భుతాలను ప్రదర్శించారు అని స్పష్టంగా చెప్పబడగా, మోషే అహరోను చేసిన సూచనలను మాంత్రికులు ఎలా చేయగలిగారు? మాంత్రికులు కొంత దయ్యపు శక్తి ద్వారా అతీంద్రియమైన అద్భుతాలు చేయగలరు అని కొందరి నమ్మకం. సాతానుకు కొన్ని సమయాల్లో అలాటి శక్తి ఇవ్వబడింది అని కొన్ని వాక్యభాగాలు సూచించినట్లుగా కనిపిస్తుంది (2 థెస్స. 2:9-12; ప్రకటన 13:14; 16:14; 19:20 చూడండి).

మరింత సాధ్యమైన వివరణ ఏంటంటే మంత్రికులు ఎల్లప్పుడు చేసే కార్యాలను చేయడంలో ఐగుప్తీయుల మాంత్రికులు ప్రవీణులు: అనగా వారు అసాధారణ కార్యాలు చేయగలరని ప్రజలను నమ్మించడం, మరియు అద్భుతాలు చేయడం. Nahum M. Sarna ఈ అభిప్రాయమునకు ఈ విధంగా చెప్పి మద్దతు పలికారు "వారి [మాంత్రికులు] యొక్క వృత్తి సంబంధమైన ప్రదర్శనలలోకుట్ర (వంచన) ఒక ప్రామాణిక అంశంగా

ఉంది."[6]

ఏ సందర్భంలోనైనా, దేవుని శక్తి కనిపించే మాంత్రికుల శక్తులకన్నా మరింత గట్టిది అని వాక్యభాగం స్పష్టపరుస్తుంది. ఆయన యొక్క దైవ శక్తి వలన, అహరోను సర్పము ఇతర సర్పములన్నిటిని మ్రింగివేసెను. కథ కొనసాగుతుండగా, అనేక తెగుళ్లను మాంత్రికులు చేయలేని సమయంలో దేవుని యొక్క శక్తి ఆధిక్యత మరింతగా స్పష్టమౌతుంది. ఇక్కడ పేరు చెప్పబడనప్పటికీ, తరువాత యూదా, క్రైస్తవ, మరియు అన్య సాహిత్యాలు ఈ మాంత్రికులలో ఇద్దరిని యన్నే మరియు యంబ్రేగా గుర్తిస్తుంది (2 తిమోతి 3:8 చూడండి).

## నీరు రక్తముగా మారుట (7:14-25)

### దేవుని ఆదేశాలు (7:14-19)

**14తరువాత యెహోవా మోషేతో ఇట్లనెను - ఫరో హృదయము కఠినమైనది, అతడు ఈ ప్రజలను పోనియ్యనొల్లడాయెను. 15ప్రొద్దున నీవు ఫరో యొద్దకు వెళ్లుము, ఇదిగో అతడు ఏటిదరికి పోవును. నీవు అతనిని ఎదుర్కొనుటకు ఏటియొడ్డున నిలిచి పాముగా చేయబడిన కఱ్ఱను చేతపట్టుకొని 16అతని చూచి - అరణ్యమందు నన్ను సేవించుటకై నా ప్రజలను పోనిమ్మని ఆజ్ఞాపించుటకుగాను హెబ్రీయుల దేవుడైన యెహోవా నన్ను నీ యొద్దకు పంపెను. నీవు - ఇదివరకు వినకపోతివి. 17కాగా యెహోవా ఆజ్ఞ ఎదనగా నేను యెహోవానని దీనిబట్టి నీవు తెలిసికొందువని యెహోవా చెప్పుచున్నాడు. ఇదిగో నా చేతిలోనున్న ఈ కఱ్ఱతో నేను ఏటి నీటిని కొట్టుదును అది రక్తముగా మార్చబడును. 18ఏటిలోని చేపలు చచ్చును, యేరు కంపుకొట్టును, ఏటి నీళ్లు త్రాగుటకు ఐగుప్తీయులు అసహ్యపడుదురని చెప్పుమనెను. 19మరియు యెహోవా మోషేతో ఇట్లనెను - నీవు అహరోనుతో - నీ కఱ్ఱను పట్టుకొని ఐగుప్తు జలముల మీద, అనగా వారి నదులమీదను వారి కాలువలమీదను, వారి చెరువుల మీదను, వారి నీటిగుంటలన్నిటి మీదను నీ చెయ్యి చాపుము; అవి రక్తమగును; ఐగుప్తు దేశమందంతటను మ్రానుపాత్రలలోను రాతిపాత్రలలోను రక్తము ఉండునని అతనితో చెప్పుమనెను.**

**వచనములు 14, 15.** ఇశ్రాయేలీయులను విడిచిపెట్టమని ఫరోను ఒప్పించుటలో కఱ్ఱ సర్పముగా మారిన అద్భుతము విఫలమైనను (7:13), మరొక సూచనను గూర్చి **దేవుడు మోషేకు** మార్గమును చూపాడు. ఇది మొదటి తెగులు: నీరు రక్తముగా మారుట. తెగులు రావడానికి గల కారణమును దేవుడు స్పష్టపరచాడు: ఫరో **మొండివాడు** మరియు **ప్రజలను పోనియ్యనొల్లడాయెను.** తెగులును ఎప్పుడు ఏ విధంగా చెప్పాలో మోషేకు చెప్పబడింది. ఆయన **ప్రొద్దున లేచి . . . వెళ్లాలి, నీవు ఫరో యొద్దకు వెళ్లుము, పాముగా చేయబడిన కఱ్ఱను** [అతని] **చేతపట్టుకొని**, మరియు **ఫరోతో** మాట్లాడాలి.

**వచనములు 16-18.** ఆయన మాట్లాడినప్పుడు, మోషే క్రింది ఇవ్వబడిన వాటిని

ప్రత్యేకించి చెప్పాలి:

1. *అతనిని ఎవరు పంపారు* - మోషే **దేవుని** చేత, యెహోవా, **హెబ్రీయుల దేవుని** చేత పంపబడ్డాడు.
2. *దేవుడు అడిగినది* - దేవుడు ఇలా చెప్పాడు, **నా ప్రజలను పోనిమ్ము**, తద్వారా ఇశ్రాయేలీయులు **అరణ్యమందు దేవునిని సేవిస్తారు**.
3. *ఫరో యొక్క మునుపటి సమాధానం* - ఫరో వినకపోయెను.
4. *తెగులును పంపుటలో దేవుని ప్రణాళిక* - **నేను యెహోవానని** ఫరో మరియు ఐగుప్తీయులందరూ **తెలుసుకోవాలని** ఆయన కోరుకొన్నాడు.
5. *తెగులు ఏమి కలిగియుంది* - **నీరు రక్తముగా మార్చబడును. ఏటిలోని చేపలు చచ్చును, ఏటి నీళ్లు త్రాగుటకు ఐగుప్తీయులు అసహ్యపడుదురు.**

ఇశ్రాయేలీయులను విమోచించమని విజ్ఞప్తిని పెంబడించలేదు, కాని ఇశ్రాయేలీయులను ఐగుప్తును విడచి వెళ్లనివ్వకుండ తిరస్కరించిన మునుపటి దానికి పర్యవసానంగా ఇది చెప్పబడింది. "నీవు ఇశ్రాయేలీయులను వెళ్లనిచ్చే వరకు ఈ తెగులును అనుభవిస్తావు" అని దేవుడు మోషేకు చెప్పలేదు. బదులుగా, ఈ విధంగా ఫరోతో మాట్లాడుమని ఆయన మోషేకు ఆదేశించెను: "నీవు ఇశ్రాయేలీయులను వెళ్లనియ్యలేదు కాబట్టి, నీ హృదయ కాఠిన్యము వలన, నీవు ఈ తెగులును అనుభవిస్తావు."

**వచనము 19. మోషే** తెగులు వస్తుందని ప్రకటించిన తరువాత, **కఱ్ఱను పట్టుకొని** [అతని] **చేతులు చాపి, ఐగుప్తుయందంతటా నీరును రక్తముగా** చేయుమని ఆయన అహరోనుకు ఆదేశించెను. **ఐగుప్తులోనున్న** ప్రతి ఒక్కరిపై తెగులు ప్రభావితం చూపుతుంది; **నదులలో** ("ప్రవాహాలు"; NIV), **కాలువలలో** ("కాలువలు"; NIV), **చెరువులలో** ("చెరువులు"; NIV), **నీటిగుంటలన్నిటిలో**, మరియు **మ్రానుపాత్రలలోను రాతిపాత్రలలోను . . .** నీరు రక్తముగా మారుతుంది. "పాత్రలు" అను పదం మూలమైన హెబ్రీ వాక్యభాగంలో లేదు. బదులుగా, "మ్రాను మరియు రాతి" (וּבָעֵצִים וּבָאֲבָנִים, *uba'etsim uba'ᵃbanim*) అని చెప్తుంది. NIV దీనిని మ్రాను బకెట్లు మరియు రాతి జాడీలుగాను అనువదిస్తుంది. నైలు నది నుండి నీరు తెచ్చుకొని నిల్వచేసే మ్రాను మరియు రాతి ట్యాంకులను (తొట్టెలు) వాక్యభాగము సూచిస్తుందని Rawlinson చెప్పాడు.[7]

## మోషే అహరోనుల విధేయత (7:20-8:1a)

**[20]యెహోవా ఆజ్ఞాపించినట్లు మోషే అహరోనులు చేసిరి. అతడు ఫరో యెదుటను అతని సేవకుల యెదుటను తన కఱ్ఱను పైకెత్తి ఏటి నీళ్లనుకొట్టగా ఏటి నీళ్లన్నియు రక్తముగా మార్చబడెను. [21]ఏటిలోని చేపలు చచ్చెను, యేరు కంపుకొట్టెను; ఐగుప్తీయులు ఏటి నీళ్లు త్రాగలేకపోయిరి, ఐగుప్తుదేశమందంతట రక్తము ఉండెను. [22]ఐగుప్తు**

**శకునగాండ్రు కూడా తమ మంత్రములవలన అట్లు చేయగా యెహోవా చెప్పినట్టు ఫరో హృదయము కఠినమాయెను, అతడు మోషే అహరోనుల మాట వినకపోయెను. [23]జరిగినదానిని మనస్సున పెట్టక ఫరో తిరిగి తన యింటికి వెళ్లెను. [24]అయితే ఐగుప్తీయులందరు ఏటినీళ్లు త్రాగలేక త్రాగు నీళ్లకొరకు ఏటి ప్రక్కలను త్రవ్విరి. [8:1a]యెహోవా ఏటిని కొట్టి యేడు దినములైన తరువాత.**

**వచనము 20. యెహోవా** ఆజ్ఞాపించినట్లు **మోషే అహరోనులు** చేసిరి అని రచయిత మరలా వ్రాసాడు. **యెహోవా ఆజ్ఞాపించినట్లు**, మరియు మోషే చెప్పినట్లు, అహరోను **తన కఱ్ఱను పైకెత్తి ఏటినీళ్లనుకొట్టగా ఏటి** నీళ్లన్నియు . . . రక్తముగా మార్చబడెను. మోషే అహరోనులు దీనిని ప్రదర్శించినప్పుడు వారికి ప్రేక్షకులుండిరి; **ఫరో** మాత్రమే ఉండడం కాదు గాని చాలామంది ఫరో **సేవకులు** కూడా ఉండిరి. ఈ సేవకులు బహుశా ప్రభుత్వ ఉన్నతాధికారులు, అనగా రాజు యొక్క సలహా మండలిలో కనిపించేవారిగా ఉండవచ్చు.

**వచనము 21.** తెగులు యొక్క ఒక పర్యవసానం ఏంటంటే **నైలు నదిలోనున్న చేపలన్నీ చచ్చి యేరు కంపుకొట్టెను**, ఎందుకంటే బహుశా చేపలు కుళ్లిపోవుటవలన. ఐగుప్తు విశ్వంపై తాకిన ఆ తెగులు దెబ్బ యొక్క పరిమాణం దాదాపు అనుహ్యామైనదిగా ఉంది. ఐగుప్తునకు నైలు నది ఒక జీవిత మూలం (జీవనాధారం)గా ఉంది; దానిలో నీరు లేకుండా ఐగుప్తీయులు బ్రతకలేరు. R. Alan Cole ఈ విధంగా వ్రాసాడు, "నైలునది దేవతగా ఆరాధింపబడింది, మరియు . . . దాని నీరు ఐగుప్తీయులకు జీవిత - రక్తం."[8] ఈ తెగులు దాదాపు నైలునదిని పనికి రాకుండా చేసింది. ఆ నది తీరాన కొన్ని మైళ్ల దూరంలో నివసించే **ఐగుప్తీయులకు** నిత్యావసరాలను అందజేయలేకపోయింది. వారు ఒక ఆహార ప్రధానమైనటువంటి చేపలపై ఆధారపడినందువలన దాని చేపలను వారు తినలేకపోయిరి. తరువాత, వారు [దాని] **నీళ్లు త్రాగలేకపోయిరి** లేదా వారి పంట సేద్యం కొరకు దానిని ఉపయోగించలేకపోయిరి.

ఈ మొదటి తెగులుకు సంబంధించి ఎగసే ఒక ప్రశ్న ఏంటంటే "నీరు నిజముగా **రక్తంగా** మారిందా?" ఇసుక, ఎర్ర మురికి, లేదా సిల్మద్రలు (algae) నీరుకు జతపరచడం వలన అది ఎర్రని రక్తంగా మారి చేపలను చంపిందా? వాక్యభాగము "రక్తము" అని చెప్తుంది కాబట్టి రక్తము అంటే "రక్తము" మరియు ఆ పదము నుండి వేరేది ఏదైనా చెప్పుటకు ప్రయత్నించడం వాక్యమును తప్పుత్రోవ పట్టించడమే అని కొంతమంది చెప్తున్నారు. "రక్తముగా" (דָּם, *dam*) అనువదించబడిన పదము సహజంగా పాత నిబంధన గ్రంథంలో "రక్తము" కొరకు ఉపయోగించబడిన పదమే. తదుపరి, దేవుని యందు నమ్మికయుంచువారు ఆయన నీరును రక్తముగా మార్చాలనుకొంటె మార్చగలడు అని అంగీకరించుటలో అనుమానించరు. యేసు ఆయన శక్తి చేత నిజమైన నీరును ద్రాక్షారసముగా చేసాడు (యోహా. 2:6-10).

దేవునికి అద్భుతములు చేయగలిగిన శక్తి ఉన్నదని నిరాకరించక లేదా వాక్యభాగామునకు అన్యాయం చేయకుండా నీరు నిజమైన రక్తముగా మార్చబడలేదు అని నమ్మువారికి ఈ అభిప్రాయం ఉండవచ్చు. పురాతన కాల ప్రజలు ఆధునిక

రసాయన పదార్థాలపై విశ్లేషణల ప్రదర్శించడంలో అసమర్థులు. అందుచేత, తెగులు చేత ప్రభావితం చేయబడిన ప్రజలకు - మరియు రచయితకు - పదార్థము రక్తము వలె కనిపించింది; అందుచేత, రచయిత దానిని రక్తముగా పిలచాడు (2 రాజులు 3:22, 23 చూడండి). మరో మాటలలో, "ఇది వైద్య విశ్లేషణలలో ఒకటి కాదు కాని బాహ్య పోలికగా ఉంది."[9] 7:20 ప్రకారం, నైలు నదిలోని నీరు రక్తముగా మార్చబడింది, కాని 7:24లో ఈ విధంగా చెప్పబడింది, తెగులు వలన "ఐగుప్తీయులు . . . నైలు నదిలోని నీరు త్రాగలేకపోయిరి." నీరు రక్తముగా మార్చబడ్డాయి, కానీ నైలు నది ఇంకను నీరు కలిగియున్నదని వాక్యభాగం తెలియజేస్తుంది. స్పష్టంగా, ఈ వాక్యభాగమునకు ఉత్తమమైన అనువాదం ఏంటంటే నీరు రక్తముగా కనిపించు ఒక విధంగా మారింది మరియు బహుశా అది రక్తపు చవిగా ఉంది కానీ ఎర్రగా, కంపుకొడుతూ, త్రాగలేని విధంగా, నదిలోని చేపలు చచ్చునంతగా అది కలుషితమైనదని రచయిత పాఠకులకు తెలియజేస్తున్నాడు.

**వచనములు 22, 23.** నైలు నది బారినపడడం ఒక విపత్తు, కాని **శకునగాండ్రు కూడా అట్లు చేయగా** (ఒక చిన్న స్థాయిలో కావచ్చు అనడానికి సందేహం లేకుండా) **ఫరో హృదయము కఠినమాయెను. యెహోవా చెప్పిన** దానిపై లేదా తన సొంత ప్రజల బాధపై శ్రద్ధ లేకుండా ఆయన తన అంతఃపురమునకు తిరిగి వెళ్లెను.

**వచనములు 24, 8:1a.** ఈ తెగులు **ఐగుప్తీయులకు** అసలు నీరు లేకుండా ఉంచెను అని రచయితే చెప్పలేదు. వారు **త్రాగు నీళ్లకొరకు ఏటి ప్రక్కలను త్రవ్విరి. యెహోవా ఏటిని కొట్టి యేడు దినములైన తరువాత** అని చెప్పబడిన వాక్యము మొదటి తెగులు యేడు దినములు జరిగెను అని సూచిస్తుంది.

## అన్వయము

### దేవుడు ప్రపంచంలో ఏ విధంగా పని చేస్తున్నాడు (7:1-10)

బైబిల్ లోని ఇతర పుస్తకముల వలె, నిర్గమకాండము కూడా దేవునిని తెలియజేయడానికి వ్రాయబడింది తద్వారా ఆయనను గూర్చి మనం మరింతగా తెలిసికొనగలము. పుస్తకము ప్రత్యక్షపరచు ఒక విషయం ఏంటంటే దేవుడు ప్రపంచంలో ఎలా పనిచేస్తున్నాడు. దేవుడు మానవులతో కలసి ఉన్నాడని నిర్గమకాండము తెలియజేస్తుంది. Deism చెప్పినట్లుగా ఆయన దూరముగా ఉండి, లోకం నుండి తీసివేయబడి మరియు తన సృష్టిని గూర్చి పట్టించుకోని వాడు కాదు ఆయన. సృష్టిని చేసి దానిలో పాలుపంచుకొనకుండ మరియు పట్టించుకోకుండా దానిలో నుండి తనను వేరుపరచుకొని దాని సొంతగా అదే పనిచేసుకొని మరియు క్షీణించిపోతుంది అని విడిచిపెట్టు దేవుడు కాడు ఆయన. దేవుడు మానవ చరిత్రలో జోక్యం చేసుకోన్నాడని పాత నిబంధన మరియు క్రొత్త నిబంధన గ్రంథం రెండు కూడా బోధిస్తున్నాయి. ఇశ్రాయేలీయులను బానిసత్వంలో నుండి విడిపించుటకు ఆయన జోక్యం చేసుకొన్నాడు. పాపము మరియు దాని యొక్క పర్యవసానం నుండి మానవాళిని విమోచిస్తానని

అబ్రాహాముతో చేసిన నిబంధన ప్రకారం, యేసు క్రీస్తును పంపుట ద్వారా దేవుడు జోక్యం చేసుకొన్నాడు.

లోకంలో ఇది వరకు దేవుడు ఏ విధంగా పని చేసాడు? నేడు ఆయన ఎలా పనిచేస్తున్నాడు?

*మొదట, ఇంతకు మునుపు అద్భుతముల ద్వారా దేవుడు పని చేశాడు.* దేవుడు అద్భుతములు చేయుటకు సమర్థుడు, మరియు మానవ చరిత్రలో ఆయన అలాగుననే జరిగించాడు. దేవుడు చేసిన అద్భుతములను గూర్చి బైబిల్ తరచు మాట్లాడుతుంది; నిర్గమకాండము అద్భుతాలతో పుష్కలంగా ఉంది. వాటిలో మండుచున్న పొద, పది తెగుళ్లు, యెర్ర సముద్రమును అద్భుతంగా దాటుట, మన్నా మరియు పూరేళ్లను ఇవ్వడం, మరియు బండ నుండి నీరు రావడం. ఇవి అద్భుతాలు కాదని తిరస్కరించడం, బైబిల్ ఆధారపడగల ఒక చారిత్రక రికార్డని తిరస్కరించడమే, మరియు వాక్యభాగము ప్రేరేపించబడినది కాదని చెప్పడమే.

బైబిల్ కాలంలో చేసిన విధంగా దేవుడు నేడు సూచక క్రియల ద్వారా పని చేయడం లేదు. అనేకమంది "అద్భుతము" అను పదమును దేవునికి కేటాయించిన అద్భుతమైన సంఘటనలను లేదా ఉపయోగకరమైన సంఘటనలకు ఉపయోగిస్తున్నారు. లోకంలో జరుగుతున్న ప్రతిదీ దేవుడు చేసిందే అని చెప్పడంలో నిరాకరించకూడాదు (తిరస్కరించకూడాదు) (యాకోబు 1:17). అయితే, దేవుడు సహజ మార్గాల ద్వారా జరిగించు ప్రతిదీ "అద్భుతం" అని చెప్పడం బైబిల్ దానిని ఉపయోగించని విధంగా వాక్యమును ఉపయోగించడమే. దేవుడు దైవపరమైన అద్భుతములు జరిగించు కాలము, సమయము - ముగియబడిందని వాక్యభాగం బోధిస్తుంది.

*రెండవదిగా, దేవుడు సాధారణ నియమాల ద్వారా పని చేస్తాడు.* సంఘటనలు "సహజమైనవి"గా బైబిల్ బోధిస్తుంది - సూర్యుడు ఉదయించడం, వర్షం కురవడం, మరియు గడ్డి పెరగడం - అనేవి దేవుని పని. యేసు చెప్పెను "[దేవుడు] చెడ్డవారిమీదను మంచివారిమీదను తన సూర్యుని ఉదయింపజేసి, నీతిమంతులమీదను, నీతిమంతులమీదను వర్షము కురిపించుచున్నాడు" (మత్తయి 5:45). *దేవుడు* "సూర్యుడ్ని ఉదయింపజేసి" మరియు "వర్షమును కురిపిస్తున్నాడు." గమనించండి, నిజముగా సహజమైన నియమాల ద్వారా జరుగు ప్రతిదీ దేవుని కార్యమే (నిర్గమ. 4:10, 11 చూడండి). ఒక వ్యక్తి అనారోగ్యమునకు గురై వైద్యుని చేత మందు తీసుకొన్నప్పుడు, ఒకరు ఈ విధంగా చెప్పవచ్చు, "వైద్యుడు [లేదా మందు] అతనిని బాగుచేసింది." మరొకరు ఈ విధంగా వాదించవచ్చు, "అతడు ప్రకృతి నియమాల వల్ల బాగుపడ్డాడు; అనగా, 'ప్రకృతి' అతనిని అనారోగ్యమునకు గురి చేసింది మరియు 'ప్రకృతి' అతనిని బాగు చేసింది." అయితే, క్రైస్తవుడు ప్రకృతి నియమాలను తిరస్కరించకుండ ఈ విధంగా చెప్పవచ్చు, "దేవుడు అతనిని బాగుచేసెను."

*మూడవదిగా, దేవుడు దైవకృతము ద్వారా పని చేస్తున్నాడు.* దేవుడు "దైవకృతము ద్వారా పని చేస్తున్నాడని" మనం చెప్పినప్పుడు, దేవుడు లోకంలో అద్భుతముల మార్గాల్లో కాకుండ మరొక విధంగా పనిచేస్తున్నాడని చెప్తున్నట్లు అర్థము. దేవుని మేలును గూర్చిన ఉత్తమమైన ప్రకటన రోమా. 8:28లో కనిపిస్తుంది.

నిర్గమకాండములో కూడా ప్రత్యేకంగా మోషే జీవితంలో వాస్తవము కనిపిస్తుంది. ఫరో యింటిలో ఆయన పెరిగాడు. మగ పిల్లల తరాలను ఆపుటకు ఫరో ప్రయత్నించకపోయినట్లయితే, మోషే ఫరో ఇంట్లో పెరిగేవాడు కాడు మరియు ఐగుప్తు నుండి ఇశ్రాయేలీయులను బయటకు రప్పించుటకు సిద్ధపడేవాడు కాడు. మోషే జీవితంలో మొదటి ఎనభై సంవత్సరములలో జరిగిన సంఘటనలను యాదృచ్చికంగా జరిగినవాటిగా మనం చెప్పగలమా? ఈ సంఘటనలన్నీ కూడా అద్భుతములుగా కాకుండా దేవుని జోక్యం ద్వారా ఆయన యొక్క ప్రణాళికలు నెరవేరడానికి జరిగినవిగా క్రైస్తవుడు చూస్తాడు.

మోషే జీవితంలో చాలామంది పాఠకులు దేవుని కార్యాన్ని చూడగలిగారు. ప్రశ్న ఏంటంటే, నేడు కూడా దేవుడు మేలు చేస్తున్నాడా? రోమా 8:28 చెప్తుంది కాబట్టి, మరియు మానవ చరిత్ర మరియు ఆదిమ సంఘ కథనములు - బహుశా మన సొంత చరిత్ర కూడా - ఆయన దైవకటాక్షము వలన జరుగునని రుజువు చేస్తుంది. ముఖ్యంగా మన పరిస్థితి కష్టముగా ఉన్నప్పుడు, ఆ సత్యము మనలను ఆదరించి ప్రోత్సహించాలి.

*నాలుగవదిగా, దేవుడు ప్రజల ద్వారా కార్యం చేస్తాడు.* దేవుడు ఒకటి చేయాలనుకొన్నాడు: ఆయన ప్రజలు ఐగుప్తు నుండి విడిపించబడాలనుకొన్నాడు. మానవ జోక్యం లేకుండా ఆ కార్యమును ఆయన నెరవేర్చగలడు. (దేవునికి విశ్వమును సృష్టించే సామర్థ్యం ఉంది, ఆయన అసాధ్యమైనది ఏదియు లేదు కాబట్టి.) బదులుగా, ఆయన చేయాలనుకొనిన దానిని చేయుటకు ఆయన మానవుని, మోషేను ప్రతినిధిగా ఎన్నుకొన్నాడు. పని దేవునిది, మరియు మహిమ దేవునికి చెందుతుంది; కాని దానిని చేయుటకు దేవుడు పొరపాటు చేయగల మానవుని ఉపయోగించుకొన్నాడు. అదే విధంగా, క్రైస్తవ యుగంలో, ప్రజలను రక్షించాలని దేవుడు కోరుకొంటున్నాడు. మానవ ప్రతినిధులను - సర్వలోకమునకు సువార్తను ప్రకటించేవారిని, బోధించేవారిని ఉపయోగించుట ద్వారా ఆ కార్యమును నేరవేర్చుతాడు (మత్తయి 28:18-20; రోమా. 10:12-17). పని దేవునిది మరియు ఫలితం దేవునికి చెందుతుంది. అయితే, మానవులు పిలుపుకు స్పందించి మరియు వారి ద్వారా దేవుడు కార్యమును జరిగించుటకు దేవునిని అనుమతించాలి (అపో. 14:27). దేవుని పిలుపును వినుటకు మరియు ఆయన పరిచర్యలో మన తలలు, చేతులు, పాదాలు, మరియు నోరు వాడబడుటకు ఇష్టత చూపాలి. దేవుడు మన ద్వారా కార్యమును చేసినప్పుడు, మనమాయనను మహిమపరచాలి.

*ముగింపు.* నేడు దేవుడు ప్రపంచంలో ప్రకృతి ద్వారా మరియు అవసరములను అందజేయుట ద్వారా క్రియాశీలంగా ఉన్నాడు, కాని మన ద్వారా కూడా ఆయన తన చిత్తమును నెరవేర్చాలనుకొంటున్నాడు. మనం దేవుని చేతిలో ఉపయోగించబడుటకు ఇష్టపడుతున్నామా? "మన దేవుడు, సజీవుడు" అని మన పాడతాము. మనం దేనిని నమ్ముదాము మరియు మనం నమ్మునట్లుగా క్రియలు చేద్దాము!

## అహరోను ప్రవక్త యొక్క పాత్రను వర్ణించాడు (7:1, 2)

ప్రవక్త యొక్క పాత్ర ఏంటి? దేవుడు తన మాటలను ఆయన నోటిలో ఉంచి మరియు ఆయన దేవుని కొరకు మాట్లాడతాడు; అతడు దేవుని బూరగా ఉంటాడు. మోషే "దేవుడుగా," ఉంటాడు మరియు అహరోను మోషే "ప్రవక్తగా" ఉంటాడు (7:1, 2). మరో మాటల్లో, మోషే "మాటలను అతని నోటిలో ఉంచాలి" (4:15). అహరోను మోషేకు ప్రతిగా "ప్రజలతో," మాట్లాడి మోషేకు "బూరగా" పని చేస్తాడు (4:16).

## నకిలీ మతము (7:22)

మోషే సూచనలను శకునగాండ్రు కూడా చేయగలిగిరి (7:22). ఎలా? బహుశా, ఇంద్రజాలం ప్రయోగించుటవలన. వారి సూచనలు వంచనతో కూడినను, అవి నమ్మకమును పుట్టించేవిగా ఉండెను. క్రొత్త నిబంధన కాలంలో, కొంతమంది స్పష్టంగా, వంచనతో కూడిన అద్భుతములను చేసిరి (అపో. 8:9-11; 2 థెస్స. 2:8-12; ప్రకటన 13:14; 16:13, 14; 19:20). క్రొత్త నిబంధన క్రైస్తవ్యమును అనుకరించుట మరో మార్గంలో సాధ్యమయ్యేదే. ప్రత్యేకంగా, అబద్ధ బోధకులు క్రీస్తు బోధనను తప్పుదారి పట్టించు విధంగా బోధించారు. రాబోవు అబద్ధ బోధకులను గూర్చి యేసు హెచ్చరించాడు (మత్తయి 7:15) మరియు అపొస్తలులు కూడా బోధించారు (1 యోహా. 4:1). క్రైస్తవ్యాన్ని తప్పుదారి పట్టించు వంచకులు నేడు ఉన్నారు మరియు శకునగాండ్రువలె నమ్మశక్యంగా ఉన్నారు. నేడు అద్భుతాలు చేయువారి నుండి మోసపోకుండా తప్పించుకోవాలనుకొంటె, వంచనతో కూడిన మతం ఉంది మరియు నిజమైన దానిని నుండి వంచనతో కూడిన దానిని వేరుపరచడం మనకు తెలియాలి. చివరకు, దేవుడే అబద్ధ మతమునకు మరియు సత్య మార్గమునకు మధ్య వ్యత్యాసమును ప్రదర్శిస్తాడు (మత్తయి 7:21-23).

---

సూచనలు

[1]John I. Durham, *Exodus*, Word Biblical Commentary, vol. 3 (Waco, Tex.: Word Books, 1987), 86. [2]Ibid., 88. [3]Umberto Cassuto, *A Commentary on the Book of Exodus*, trans. Israel Abrahams (Jerusalem: Magnes Press, 1997), 94. [4]Durham, 89. [5]George Rawlinson, "Exodus," in *The Pulpit Commentary*, vol. 1, *Genesis and Exodus*, ed. H. D. M. Spence and Joseph S. Exell (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1950), 166. [6]Nahum M. Sarna, *Exploring Exodus: The Origins of Biblical Israel* (New York: Schocken Books, 1996), 67. [7]Rawlinson, 172. [8]R. Alan Cole, *Exodus: An Introduction and Commentary*, Tyndale Old Testament Commentaries (Downers Grove, Ill.: Inter-Varsity Press, 1973), 90. [9]Ibid.